విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 02 మార్చి 2025 8 పేజీలు

చరితార్థుడు నేలపూడి సూరన్న

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర - అమలాపురం : నిరుపేదల ఆకలి తీర్చే భూమి కోసం పోరాటాలు చేసి వేలాది గృహాల్లో నేలపూడి సూరన్న చిరస్థాయిగా నిలిచిపోయాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. శనివారం అంబాజీపేట జయంతి నగర్లో జరిగిన నేలపూడి సూరన్న 30వ వర్ధంతి సందర్భంగా జరిగిన స్మారక బహిరంగ సభలో డేగా ప్రభాకర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ సూరన్న చేసిన భూ పోరాటాలు చరిత్రలో నిలిచిపోయాయన్నారు. ఈ ప్రాంతంలో ఎందరికో సూరన్న పోరాటంతో ఇళ్ల స్థలాలు, ఇకు వచ్చాయన్నారు. సూరన్న మరణించి 30 ఏళ్లు అయినా ఆయన జ్ఞాపకాలు ఎప్పటికీ చిరస్థాయిగా వున్నాయన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలు గ్రామ గ్రామాన నిర్వహించాలన్నారు. అంతకు ముందు అంబాజీపేట సెంటర్ నుండి నిర్వహించిన సిపిఐ శత వసంతాల ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

కె.రామకృష్ణ, డేగా ప్రభాకర్, తాటిపాక మధు, కె. సత్తిబాబు, దేవ రాజేంద్ర ప్రసాద్, పితాని, అన్నవరం, నేలపూడి స్టాలిన్ బాబు, నాగభూషణం, గిరిబాబు, నల్లి చిట్టిబాబు, పెద్దిరెడ్డి రాము, జీవి రమణ, చెల్లుబోయిన కేశవశెట్టి, తాతారావు, నిమ్మకాయల శ్రీనివాసులు నాయకత్వం వహించారు. అనంతరం నేలపూడి సూరన్న, చిత్రపటాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. మృత వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

దగాకోరు బడ్జెట్

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దగాకోరు బడ్జెట్ అని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా సూపర్ సిక్స్‌తో పాటు, మహిళలు, నిరుద్యోగులు, యువత, రైతాంగంతో పాటు అన్ని వర్గాలను విస్మరించి మోసం చేశారని మండిపడ్డారు. బడ్జెట్లో కౌలు రైతుల ఊసే లేదని, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి ఇస్తానని వాగ్దానం చేసి బడ్జెట్లో కేటాయింపులు లేని కారణంగా యువతను మరింత మోసం చేశారని విమర్శించారు. అన్నదాత సుఖీభవ,తల్లికి వందనం పథకాలకు కోత విధించి అరకొర కేటాయింపులు చేసి ఎప్పటినుండి అమలు చేస్తారో నిర్దిష్టంగా ప్రకటించలేదన్నారు. మహిళలకు ప్రతినెలా రూ.1500 ఇస్తామని ప్రకటించి నిధుల ప్రస్తావనే లేకుండా చేశారన్నారు. ఉచిత బస్సు పథకం ప్రస్తావనే లేదన్నారు.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసంపై నిర్లక్ష్యాన్ని మరో సారి ప్రదర్శించిందన్నారు.ప్రతిపక్షంలో ఉండగా ప్రజలకు న్యాయం చేస్తామని వాగ్దానం చేసి తాజా బడ్జెట్లో ఉండి చేయి చూపటం చంద్రబాబు కపట వైఖరి తేటతెల్లం చేస్తుందన్నారు.

పొగాకు బ్యారన్లు దగ్ధం

విశాలాంధ్ర - సీతానగరం: అగ్ని ప్రమాదంలో రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధమయ్యాయి. మండలంలో కాటవరం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోలిన ప్రకాశంకు చెందిన అవురు గడ్డిపాకలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో అక్కడకు దగ్గర్లో ఉన్న మరో రెండు పాకలతో పాటు రెండు పొగాకు

బ్యారన్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ రెండు బ్యారెన్లు చిట్టూరి వీర్రాజు(వంటి అబ్బులు), చిట్టూరి ప్రకాశం అనే రైతులకు చెందినవి అని తెలిపారు. మూడు ఫైర్ ఇంజన్లు, సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని సుమారు మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు 20 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని స్థానికులు తెలిపారు.

కాదేది అవినీతికి అనర్హం!

- వృక్షాలను సైతం వదలని మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కాదేది అవినీతికి అనర్హం అన్న చందంగా పేరెన్నికగన్న వృక్షాలు సైతం మాయం అవడం ఆశ్చర్యం గొలుపుతోంది. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఆర్ అండ్ బి అతిథి గృహ ఆవరణలో ఎదుగుదల వృక్షాలు మాయం అవ్వడం చూపరులకు, గ్రామస్థులకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన

రహదారులు భవనాల అతిథి గృహం వుంది. ఇక్కడ ఎంతో మంది అధికారులు, మంత్రులతో పాటుగా రాజమండ్రి రైల్వే కం రోడ్డు బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా బ్రిటిష్ అధికారులు కూడా ఇక్కడ బస చేసిన చరిత్ర వున్న బంగ్లా,ప్రస్తుతం వాడుకలో లేక శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రాంగణంలో మొక్కలు పెద్ద వృక్షాలుగా ఎదిగిపోయాయి. ఈ ప్రాంతంలో అనేక అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిపోయింది. అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించే నాథుడే కరువ య్యాడు. పట్టణ ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ▶మిగతా 2లో..

పెన్షన్లు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -తాడేపల్లిగూడెం రూరల్ : వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్ లను లబ్ధిదారులు వ్యక్తిగత, వైద్య, ఆహార ఖర్చుల అనంతరం మిగిలిన సొమ్ములను పొదుపు చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం మండలంలోని నవాబుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల నగదును అందజేశారు. లబ్ధిదారులను కుశల ప్రశ్నలు వేస్తూ ఆరోగ్యం బాగుందా, ఇంటికి వచ్చి పెన్షన్ అందజేస్తున్నారా, నెలకు ఎంత ఇస్తున్నారు, ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా అని ఆరా తీశారు.

లబ్ధిదారులు స్పందిస్తూ మొదటి తేదీన వేకువజామునే ఇంటి వద్ద పింఛన్ అందుకుంటున్నామని, ఇబ్బందులు ఏమీ లేవని సంతోషాన్ని వెలిబుచ్చారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 25 రకాల పింఛన్లను 2,26,044 మంది లబ్ధిదారులకు రూ.96.61 కోట్లు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నూరు శాతం పింఛన్లు పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్డీఓ కతీబ్ కౌసర్ భానో, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఎస్ ఎస్ వేణుగోపాల్, తహసిల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో ఎం.విశ్వనాథం, సర్పంచ్ మద్దుకూరి గంగా భవాని, డిఆర్డిఏ ఏపీవో టి.మురళీకృష్ణ,, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ మండలి పునః ప్రారంభించాలి

విశాలాంధ్ర - గొల్లప్రోలు : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని శ్రీ రామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి అనుబంధ సంఘం) అధ్యక్షులు అనిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా శ్రీరామచంద్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు, గొల్లప్రోలు నగర పంచాయతీ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిథిగా ఏపీ బిల్డింగ్, కన్‌స్ట్రక్షన్ ▶మిగతా 2లో

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర -ఏలూరు: రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి కృషి చేస్తుందని తెదేపా ఎస్.సి. సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, టిడిపి మూడవ డివిజన్ ఇంచార్జ్ జాలా బాలాజీ పేర్కొన్నారు. స్థానిక మూడవ డివిజన్‌లో శనివారం పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాలా బాలాజీ మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ లో సూపర్ సిక్స్ అమలుకు పూర్తిస్థాయి కేటాయింపులు చేశారని తెలిపారు. ఎస్.సి.,ఎస్.టి.,బి.సి., మైనారిటీ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేటాయింపులు చేశారని పేర్కొన్నారు. ఎస్.సి.,ఎస్.టి., అభివృద్ధిలో కీలకంగా ఉండే ప్రాయోజిత పథకాలకు ఊపిరి పోసేలా కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు.దళితుల అభివృద్ధికి ఉద్దేశించిన పిఎం అజయ్ (100 రాయితీ) ని పునరుద్ధరించి, రూ.150 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. స్థానిక శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) నగర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెన్షన్లను ఒకటో తారీకుని పంపిణీ చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.ఈ కార్యక్రమంలో వీరబత్తిన వనిత, షేక్ రిజ్వానా, సుల్తానా బేగం, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు హెల్పర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని నిరుద్యోగ యువతకు హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్థానిక డి.యల్.టి.సి సహాయ సంచాలకులు ఎస్.ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు.షార్ట్ టర్మ్ కోర్స్ క్రింద హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.పదో తరగతి ఆ పైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని, దరఖాస్తులను ఈనెల 10 వ తేదీలోగా డి. యల్.టి.సి. కార్యాలయం, కలెక్టరేట్ వద్ద, ఏలూరు చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు: 9493482414 నెంబర్ ను సంప్రదించగలరని ఉగాది రవి తెలియజేసారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఫిబ్రవరి మాసంలో ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులపై 3091 కేసులు నమోదు చేసి,రూ.1.05 కోట్లను అపరాధ రుసుముగా విధించినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఇందులో హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 905 కేసులు, ట్రిపుల్ డ్రైవింగ్ 31 కేసులు, రవాణా మరియు రవాణేతర వాహనాలకు గాను డ్రైవింగ్ లైసెన్స్ లేనివారిపై 356, వాహన భీమా కలిగిలేనివి 291,ఫిట్నెస్ కలిగిలేనివి 143,టాక్స్ చెల్లించని వాహనాలపై 132 కేసులు, 1202 ఇతర కేసులు జిల్లాలోని వాహన తనిఖీ అధికారులు నమోదు చేసినట్లు షేక్ కరీమ్ తెలిపారు.ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని,ప్రతి ద్విచక్ర వాహనదారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయవద్దని ఆయన అన్నారు.సీట్ బెల్ట్ ధరించి కారు నడపడం అలవాటుగా మార్చుకోవాలని,రవాణా వాహనాలకు క్రమం తప్పకుండా టాక్స్,భీమా చెల్లిస్తూ,పర్మిట్, పొల్యూషన్, ఫిట్నెస్ ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని అయన వాహనదారులను కోరారు.

వ్యక్తి అదృశ్యం

విశాలాంధ్ర - కుక్కునూరు : మండలంలోని గొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుమ్మల కుమారస్వామి అనే వ్యక్తి నెల రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. ఎంత వెతికినా అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఇటీవల కుక్కునూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అమరులకు జోహార్లు

విశాలాంధ్ర - మొగల్తూరు : మాదిగ జాతి ముద్దుబిడ్డల భావితరాల భవిష్యత్తు కోసం మందకృష్ణ మాదిగ ఎస్సి వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటం చేస్తూ ఉండగా ఈ పోరాటంలో ప్రాణ త్యాగం చేసి అమరులైన వారికి నరసాపురం నియోజకవర్గ ఎంఆర్పిఎస్ అధ్యక్షులు కారుమంచి అశోక్ జోహార్లు అర్పించారు. శనివారం మండల పరిధి కేపీ పాలెం హై స్కూల్ సెంటర్లో ఏర్పాటుచేసిన సభలో, అమరులను గుర్తు చేస్తూ నివాళులర్పించి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు యార్లగడ్డ రత్నరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ పశ్చిమగోదావరి జిల్లా మహిళా అధ్యక్షులు ఎస్. ఝాన్సీ లక్ష్మి, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు గరికిపూడి జేమ్స్ రాజు, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సీనియర్ నాయకులు కారుమంచి జీవరత్నం, నరసాపురం నియోజక వర్గం ఉపాధ్యక్షులు తేన్నేటి శేఖర్, నియోజకవర్గం గౌరవ అధ్యక్షులు కారుమంచి హరిబాబు, నరసాపురం టౌన్ ప్రెసిడెంట్ కొడమంచిలి దాసు ,మండల అధ్యక్షులు మెరుపే మోజెష్, తేన్నేటి రాంబాబు, తెన్నేటి శ్రీను, కొండేటి రాజు, ఉల్లంపర్తి ప్రభాకర్, సిద్దుల గాంధీ, ఉల్లంపర్తి సిమోను, గ్రామస్తులు గ్రామపెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చేపపిల్లలు నీటిలో విడుదల

విశాలాంధ్ర - ఉంగుటూరు: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కార్యక్రమం శనివారం ఉంగుటూరు మండలం వెల్ల మిల్లి వీరభద్రుని చెరువు ట్యాంకు వద్ద జరిగింది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో వీరభద్రుని చెరువు ట్యాంకులో 60,000 చేప పిల్లలను విడుదల చేశామని బాదంపూడి ఎఫ్ డి ఓ మంగారావు తెలి పారు. వీటిని బొమ్మిడి సొసైటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

గన్ని దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలో పలు సమస్యలను పరిష్కరించాలని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు దృష్టికి కుక్కునూరు మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు తీసుకెళ్లారు. రెండు నెలల నుంచి నిలిచిన కుక్కునూరు ప్రధాన రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.41.15 కాంటూరు లెవల్ లో మండలంలో పెండింగ్ లో ఉన్న పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు

అనర్థం

(1వ పేజీ తరువాయి)

పట్టించుకున్న పాపాన పోలేదు. ఇదే అదునుగా ప్రధాన రహదారికి ఆర్ అండ్ బి స్థలానికి ఎదురుగా పలువురు రాజకీయ కుల సంఘాల నాయకుల విగ్రహాలు వెలసి పోయాయి. ఆర్ అండ్ బి ఆవరణలోని వృక్షాలు ఒక్కొక్కటిగా మాయం అవుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు పెద్ద వృక్షాలను నరికి తరలించేందుకు ప్రయత్నించగా, స్థానికులు సంబంధిత ఆర్ అండ్ బి అధికారులకు ఫోన్లో సమాచారం అందించగా అనుమతి లేకుండా చెట్లు నరికిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకుంటామని డీఈ హరికృష్ణ తెలిపారు. నరికిన వృక్ష సంపదను యథేచ్ఛగా తరలించుకుపోయారు. ఈ విషయమై విశాలాంధ్ర విలేఖరి డి.ఇ.ని ప్రశ్నించగా తరలించిన వృక్ష సంపదను తిరిగి తీసుకువస్తామని సమాధానం చెప్పడం ఆశ్చర్యం వేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా వృక్ష సంపద తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.ప్రధాన రహదారికి ఆనుకుని వున్నా ఎంతో విలువైన స్థలాన్ని ప్రభుత్వ అధికారులు రాజకీయ నాయకులు కలుగజేసుకుని అందరికి ఉపయోగ పడే ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆర్ అండ్ బి అతిథి గృహ ప్రాంగణంలో ఉన్న భారీ వేప చెట్టు పడిపోవడంతో జంగారెడ్డిగూడెం రహదారులు భవనాల శాఖ అధికారులు గత నెల 24వ తేదీన వేలంపాట నిర్వహించారు. పడిపోయిన చెట్టుకు వేలం పాట పాడి, ప్రాంగణంలో ఉన్న పలు రకాల చెట్లను అక్రమంగా నరికివేశారు. ప్రభుత్వ యంత్రాంగం ఇకనైనా తక్షణం స్పందించి మండలంలో ఉన్న పురాతన వృక్షాలను రక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభించాలి

(1వ పేజీ తరువాయి)

వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని అసంఘటిత రంగ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల ప్రాణాలకు రక్షణ కరువైందన్నారు. ఎత్తైన ప్రాంతాల నుండి పనిచేస్తూ మరణించిన, సహజ మరణం పొందిన, శాశ్వత అంగవైకల్యానికి గురైన, పనులు చేసేందుకు మార్గమధ్యంలో ప్రయాణాల్లో మరణించిన వారికి ఆర్థిక సహాయం కరువైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదుకోవాలని సంక్షేమ మండలిని పునః ప్రారంభించి సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రసాద్ కోరారు. గత ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలిలో పథకాల నిధులు దుర్వినియోగం అయ్యాయని, వాడుకున్న నిధులు బోర్డుకి తిరిగి జమ చేయాలని కోరారు.

కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్‌లు మంజూరు చేయాలని, విద్య, వైద్య సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందించాలని, భవన నిర్మాణ కార్మికుల కార్యాలయానికి స్థలం కేటాయించి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, కన్స్ట్రక్షన్ రంగంలో వసూలు చేస్తున్న 1 శాతం సెస్ నిధులను 2 శాతానికి పెంచి వసూలు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లోసెస్ వసూలు చేయాలని కోరారు. అనంతరం గొల్లప్రోలు మండల సూపరింటెండెంట్‌కు భవన నిర్మాణ కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటి యుసి సీనియర్ నాయకులు కేశవరం అప్పల రాజు, మొగలి వరప్రసాద్, మోకిరెడ్డి గంగబాబు, కోలా వీరబాబు, పడాల శ్రీను, ముమ్మిడి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు మొదలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలో ఏర్పాటుచేసిన రెండుకేంద్రాలలో ఇంటర్ పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు. రెండు కేంద్రాలలో 293 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాయాల్సి ఉండగా 250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 43 మంది హాజరు కాలేదు. ధర్మాజీ గూడెంలోని ఎమ్మెన్నార్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ, ఉన్నత పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.ఈ రెండు కేంద్రాల పరిధిలో 144 సెక్షన్తో పాటు పరీక్ష జరిగే సమయంలో పోలీసులు పహారాను ఏర్పాటు చేశారు. గ్రామంలోనే ఐదు కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ గ్రామంలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు సౌకర్యంగా ఉందని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

అర్హులందరికీ పెన్షన్లు అందజేత

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో పెన్షన్ల పంపిణీ సజావుగా జరిగిందని, ఉదయానికల్లా పెన్షన్ పంపిణీ చేశారని ఎంపీడీవో వాణి తెలిపారు. మండలంలో జరిగిన పెన్షన్ల పంపిణీని ఈమె పర్యవేక్షణ చేశారు. పెన్షన్ల తొలగింపు ఎవరికి జరగలేదని అర్హులందరికీ పెన్షన్లు వచ్చాయని తెలిపారు.ఈ నెలలో7,823 మందికి పెన్షన్లు వచ్చాయని గత నెలలో పెన్షన్లు ఇచ్చిన వారందరికీ ఈ నెలలో పెన్షన్లు మంజూరు అయ్యాయని తెలిపారు.మొదటి రోజు7,430 మందికి పెన్షన్లు అందించామని అన్నారు.పెన్షన్లు అందుకోలేని వారికి ఒకటి రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అందజేస్తామని తెలిపారు.ఉద్యోగ సిబ్బంది సకాలంలో పెన్షన్లు ఇవ్వటాన్ని ఈమె అభినందించారు.

రావిచర్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర- నూజివీడు :నూజివీడు మండలం రావిచర్ల గ్రామం లోని పంచాయతీ కార్యాలయంలో శనివారం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి, గ్రామ సర్పంచ్ కాపా శ్రీనివాసరావు చేతులమీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాపా శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరివీధి కృష్ణ తన తల్లిదండ్రుల పేరిట సేవా ట్రస్ట్ ఏర్పాటుచేసి, నిజమైన పేదలకు వైద్య సేవలు క్షేత్రస్థాయిలో అందజేయడం అభినందనీయమన్నారు. యువ న్యాయవాదిగా పేదలకు ఉచిత న్యాయ సేవ అందించడమే కాక, సామాజిక సేవలో భాగంగా పేద కుటుంబాలకు వైద్య సేవలను చేరువ చేయడం ప్రశంసనీయమన్నారు. సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి కృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో ముగిసిన ఆప్టిట్యూడ్ శిక్షణ

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న ఆప్టిట్యూడ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. రిసోర్స్ పర్సన్ డి.ఎల్.ఎన్.డీ. లక్ష్మి ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, మ్యాథమెటికల్ రీజనింగ్, సమయ పాలన, నాయకత్వ లక్షణాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు రాజు బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ అంజన్ కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ సిహెచ్. రామ్ కిషోర్, కె.వెంకన్న నాయుడు, హెచ్ఓడిలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయకుంటే బ్లాక్‌లిస్ట్

- జిల్లాలో ఎక్కడా సాగు, త్రాగునీటి సమస్య తలెత్తకూడదు
- ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర-దెందులూరు: నిర్దేశించిన సమయం లోగా ఇరిగేషన్ కాలువలు, చెరువులలో గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో ఉంచాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏలూరు రూరల్, దెందులూరు మండలం సత్యనారా యణపురం, సింగవరం, భీమడోలు మండలం గుండుగొలను, తదితర ప్రాంతాలలోని ఇరిగేషన్ కాలువలు, చెరువులను శనివారం ఇరిగేషన్, రెవిన్యూ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పనులకు ఎటువంటి నిధుల కొరత లేదని, గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు చేయని కారణంగా సాగు, త్రాగునీటి సమస్య తలెత్తిందన్న ఫిర్యాదు అందితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. నిర్దేశించిన సమయంలోగా ఇరిగేషన్ కాలువలు, చెరువులలో గుర్రపుడెక్క, తూడు, పూడికతీత పనులు పూర్తి అయ్యేలా అధికా రులు పర్యవేక్షించాలని, కాంట్రాక్టర్, అధికారులు నిర్లక్ష్యంగా కారణంగా సమస్యలు తలెత్తితే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని, అధికారు లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా సాగు, త్రాగునీటికి ఎటువంటి కొరతా లేకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్ కెనాల్స్ నుండి అనధికార సాగునీటి వినియోగం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం సత్యనారాయణ పురం, సింగవరం గ్రామాలలో ఇరిగేషన్ కాలువలలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి. నాగార్జునరావు, ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్లు సుమతి, రమాదేవి, ఇంజనీర్లు పి. సుబ్రహ్మణేశ్వరరావు, ఎస్. సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మురళీకృష్ణం రాజు, నీటిపారుదల సంఘాల చైర్మన్ వెలమటి రామచంద్రప్రసాద్, సాగునీటి సంఘాల అధ్యక్షులు చలసాని వెంకట రాంబాబు, నెరుసు వెంకటరమణ, పర్వతనేని రంగారావు, స్థానిక రైతులు, స్థానిక ప్రముఖులు, ప్రభుతులు, కలెక్టర్ వెంట ఉన్నారు.

ఎంపీయూపీ పాఠశాలను హైస్కూల్‌గా మార్చండి

విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో దిప్పకాయలపాడు గ్రామంలో ఉన్న ఎంపీయుపి పాఠశాలను, హైస్కూల్‌గా చేయాలని కోరుతూ దిప్పకాయలపాడు గ్రామస్తులు పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం బాయ్‌కాట్ చేశారు.

రైతు నాయకులు కాకర్ల నందియ మాట్లాడుతూ గ్రామంలో ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు ఎంపీ యూపీ పాఠశాలగా ఉన్న పాఠశాలను ప్రైమరీ పాఠశాలగా మార్చడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని, తమ గ్రామంలో విద్యనభ్యసించడానికి విద్యార్థిని విద్యార్థులు అధికంగా ఉన్నారని ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు పాఠశాలలో తరగతులు నిర్వహించాలని, లేనిపక్షంలో గ్రామస్తులంతా ఒక్కటై తరగతులను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ సున్నం శాంతకుమారి మాట్లాడుతూ పదవ తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసించాలంటే మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తుందని, దూర ప్రయాణాలు చేయలేక పేద విద్యార్థులంతా చదువులను మధ్యలోనే నిలిపి వేస్తున్నారని, తమ గ్రామంలో 10వ తరగతి వరకు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 12 మంది గైర్హాజర్

విశాలాంధ్ర - కలిదిండి: ఇంటర్ పరీక్షలకు మొదటి రోజు 12 మంది గైర్హాజర్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎన్. జి కే రాజు తెలిపారు. శనివారం స్థానిక అల్లూరి సీతారామరాజు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 194 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 182 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. 12 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

విశాలాంధ్ర - గణపవరం: ప్రశాంతంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగినట్లు గణపవరం శ్రీ చింతలపాటి బాపిరాజు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎం. రఘు తెలిపారు. శనివారం ఫస్ట్ ఇయర్ తెలుగు పరీక్షకు 56 మంది విద్యార్థులకు గాను 50 మంది పరీక్షలు రాశారని, ఆరుగురు గైర్హాజరైనట్లు తెలిపారు. సాంస్క్రిట్ 176 మంది విద్యార్థులకు 173 మంది హాజరైనట్లు ముగ్గురు గైరాజరైనట్లు తెలిపారు. హిందీలో 16 మందికి 14 మంది పరీక్షలు రాశారని ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. ఒకేషనల్ 23 మంది విద్యార్థులకుగాను 22 మంది పరీక్షలు వ్రాశారని ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు. మొత్తం 271 మందికి 259 మంది పరీక్షలు రాసినట్లు వివరించారు. పరీక్షలు వ్రాసే విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ కళాశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు రఘు తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

విశాలాంధ్ర- ఉంగుటూరు : తాడేపల్లిగూడెం ఆసుపత్రిలో ఉన్న ఉంగుటూరు మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్‌కు రూ.15000 పెన్షన్ శనివారం సచివాలయ సిబ్బంది అందజేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎంత దూరంలో ఉన్నా అక్కడికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్నామని ఎంపీడీవో జిఆర్ మనోజ్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో రావిపాటి నాగేశ్వరరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి– సిపిఐ

విశాలాంధ్ర -నూజివీడు : బలివే శివరాత్రి సందర్భంగా తమ్మిలేరులో మునిగి మరణించిన తిమ్మక్కపాలెం గ్రామ యువకుల కుటుంబాన్ని, అక్కిరెడ్డిగూడెం గ్రామ యువకుని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నూజివీడు నియోజకవర్గ సమితి నాయకులు శనివారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నేత నిమ్మగడ్డ నరసింహ మాట్లా డుతూ బలివే ఉత్సవాల సమయంలో ప్రభుత్వ అధికారుల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టడంలో వైఫల్యం కారణంగా రెండు కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం, పక్క గృహ నిర్మాణం, కుటుంబ సభ్యుల అర్హతల బట్టి ప్రభుత్వ ఉద్యోగం, రెండు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెంగల వెంకటేశ్వర రావు, బొప్పుడి రాంబాబు, కొక్కిరపాటి ఆనంద్, పామర్తి మధు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో సాంస్కృతిక రంగానికి అన్యాయం

విశాలాంధ్ర -భీమవరం: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సాంస్కృతిక రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా శాఖ విమర్శించింది.

జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్, ప్రజా కళాకారుడు ఛాన్‌భాషా బడ్జెట్ పై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిధులు సాంస్కృతిక రంగానికి ఏమాత్రం సరిపోవని, యువజన పర్యాటక సాంస్కృతిక రంగానికి కేటాయించిన 469 కోట్లు ఏ మూలకు రావని నాయకులు విమర్శించారు.

సాంస్కృతిక శాఖలో ఇప్పటికే చాలామంది కళాకారులు పింఛన్లు కోసం ఎదురుచూస్తున్నారని వేలాది దరఖాస్తులు సాంస్కృతిక శాఖలో పెండింగ్లో ఉన్నాయని వారందరికీ తక్షణం పెన్షన్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. సాంస్కృతిక శాఖ నిర్వహణ, నంది నాటకోత్సవాలు, పెన్షన్లు, ఉగాది పురస్కారాలు, కందుకూరి జయంతి పుష్కరాలు ,నాటక పరిషత్తుల నిర్వహణ కు సహకారం, కూచిపూడి నాట్య కళా ఉత్సవాలకు సహకారం, కళాకారులకు గౌరవ పురస్కారాలు, జానపద ప్రాచీన కళారూపాలను ఆ కళాకారులను ఆదుకోవడం ఇంకా కళా రంగంలో ఎన్నో రకాల బాధ్యతలు సాంస్కృతిలో శాఖపై ఉందని వీటిని ఆదుకోవాలంటే బడ్జెట్లో కళా రంగానికి అత్యధిక నిధులు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, నిధులు కేటాయించి కళా రంగాన్ని ఆదుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

మంచినీటి ట్యాంకులో చిన్నారుల స్నానాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో అచ్యుతాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న మంచినీటి ట్యాంకులో మూడు రోజుల నుండి గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిరోజు ట్యాంక్ లోపల కు దిగి స్నానాలు చేసి నీటిలో ఆడుకునే వీడియో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిన్నారులు మంచినీటి ట్యాంకులో స్నానాలు చేయడంతో గ్రామస్తులంతా త్రాగే నీటిని కలుషితం చేస్తున్నారని ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న సంబంధిత పంచాయతీ అధికారులు మంచినీటి ట్యాంకు వద్దకు చేరుకొని చిన్నారుల తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేసి తగు చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. మంచినీటి ట్యాంకుపై మూతను ఏర్పాటు చేసి, ట్యాంక్ పైకి ఎవరు ఎక్కకుండా ఉండటానికి గేటు అమర్చడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గ్రామాల్లో ప్రజల నివాసాలు చుట్టుపక్కల చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని గణపవరం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఆర్. బేబీ శ్రీలక్ష్మి అన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలలో భాగంగా మొదటి రోజు ఉదయం 6 గంటల నుండి గణపవరం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను బృందాలుగా విభజించి ప్రతి ఇంటికి వెళ్ళి తడి,పొడి చెత్త పైన అవగాహన కల్పించి ఇంటివద్దనే చెత్త వేరు చేసి ఇవ్వాలిందిగా తెలియజేసినట్లు ఆమె అన్నారు. గణపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని ఇళ్ల నుంచి తడి పొడి చెత్తను వేరు వేరు గా సేకరించి ఆ చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ వద్దకు తరలించనున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ మూర అలంకారం భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీల విస్తరణ అధికారి (ఇఓపిఆర్డి) పల్లి వెంకట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి దార్ల శివ రామ ప్రసాద్ (గ్రేడ్1, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కలెక్టర్ పర్యవేక్షణలో బలివే ఉత్సవాలు విజయవంతం

విశాలాంధ్ర- ముసునూరు: ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానము వార్షిక మహాశివరాత్రి ఉత్సవములు గత నెల 25వ తేదీ నుండి 28 వరకు మూడు రోజులపాటు నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ రాజ్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారుల సహకారంతో విజయవంతంగా ముగిశాయి. సదరు ఉత్సవాల సందర్భంగా బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానమునకు వచ్చిన ఆదాయ వివరాలు పూజా రుసుముల ద్వారా 9,54625 రూపాయలు, విరాళముల ద్వారా 2, 68,098 రూపాయలు హుండీల ద్వారా 13, 77,951 రూపాయిలు, ఖాళీ స్థలముల ద్వారా 13, 10,000 రూపాయలు కొబ్బరి చెక్కల ద్వారా 1,30,000 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుకు ఆన్ లైన్ శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాసన మండలికి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి ద్వైవార్షిక ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఆన్ లైన్ శిక్షణ అందించింది. ఫిబ్రవరి 27వ తేదీన జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం నిర్వహించిన ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమంలో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు.

మొక్కజొన్న ఫ్యాక్టరీల్లో ప్రమాదాలపై అధికారుల దృష్టి

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలం లోని మొక్కజొన్న ఫ్యాక్టరీలలో ఇటీవల జరిగిన రెండు సంఘటనలలో ఇరువురు మృతి చెందిన సంఘటనలను అధికారులు సీరియస్ గా తీసుకున్నారు. వీటిపై దర్యాప్తు చేపట్టారు. ములగలంపాడు జివస్ సీడ్స్ ఫ్యాక్టరీలో బీహార్ రాష్ట్రానికి చెందిన చూపేష్ కుమార్ శుక్రవారం మృతి చెందాడు. ఫ్యాక్టరీలో పని చేయడానికి వచ్చి ఇతను ఫ్యాక్టరీలోనే మృతి చెందాడు..గత నెల 26న ధర్మాజీగూడెంలోని విజయలక్ష్మి మొక్కజొన్న ఫ్యాక్టరీలో ముసునూరుకు చెందిన ఆగస్టీన్ మృతి చెందాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి డ్రైయర్ బిన్నుల్లో పడి మృతి చెందగా, ముసునూరుకు చెందిన వ్యక్తి ట్రాక్టర్ కిందపడి మరణించాడు.

ఈ రెండు సంఘటనలతో ఫ్యాక్టరీలలో నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అనే అనుమానాలు చోటు చేసుకున్నాయి. దీంతో అధికారులు దృష్టి పెట్టారు.లేబర్ ఆఫీసర్లు తనిఖీలు చేపట్టారు.ఫ్యాక్టరీలో పనిచేసే క్యాజువల్, కాంట్రాక్టర్ వర్కర్లు ఎవరైనా సరే మృతి చెందిన, గాయపడిన వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్టు ప్రకారం ఫ్యాక్టరీ యాజమాన్యం నష్టపరిహారం ఇవ్వాలి. ఫ్యాక్టరీలలో

ప్రమాదాలు జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఇటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారా? లేదా? అనే విషయాలపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. వీటి పైనే అధికారులు దృష్టి పెట్టారు. ఫ్యాక్టరీ లోకి వచ్చే వాహనం దగ్గర నుంచి, ఫ్యాక్టరీలో పనిచేసే వారికి రక్షణ ఉండాలి. పనిచేసే ప్రతి ఒక్కరికి బూట్లు,హెల్మెట్లు ఉండాలి.వీటిని యాజమాన్యమే సమకూర్చాలి. యంత్రాల వద్ద పని చేసే వారికి సంబంధించి మరిన్ని రక్షణ చర్యలు యాజమాన్యం ఏర్పాటు చేయాలి. ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇలా అనేక జాగ్రత్తలు ఉన్నాయి. ఇటువంటి జాగ్రత్తలను నామమాత్రంగా అనుసరిస్తున్నారా? అనే అనుమానాలు ఇప్పుడు రేకెత్తుతున్నాయి. ప్రమాదాలు జరగకపోతే వీటిపై చర్చ ఉండదు. ప్రమాదాలు జరగటంతో చర్చ మొదలయ్యింది. ఏలూరు జిల్లా పరిధిలో దాదాపు 25 మొక్కజొన్న ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఒక్కొక్క ఫ్యాక్టరీలో మూడు నుంచి ఐదు వరకు డ్రైయర్ బిన్నులు ఉంటాయి. మూడు నెలలు జరిగే ఈ సీజన్లో దాదాపు పదివేల మంది కూలీలు పనిచేస్తుంటారు. కోట్లలో వ్యాపారం జరుగుతుంటుంది. ఇటువంటి అప్పుడు ప్రతి ఫ్యాక్టరీలో జాగ్రత్తలు తీసు కోవాల్సి ఉంది. కొన్నిచోట్ల జాగ్రత్తలు అంతంతమాత్రంగానే ఉన్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.తనిఖీలు చేసే అధికారులు వీటిపై క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఫ్యాక్టరీలకు నోటీసులు: ములగలంపాడులోని జివస్ సీడ్స్ ఫ్యాక్టరీకి, ధర్మాజీగూడెంలోని విజయలక్ష్మి ఫ్యాక్టరీకి నోటీసులు జారీ చేశామని లేబర్ ఆఫీస్ అసిస్టెంట్ కమిషనర్ నాగేశ్వరరావు తెలిపారు. ప్రమాదాలు ఎలా జరిగాయి, చనిపోయిన వారి పూర్తి వివరాలు అందజేయాలని నోటీసులు పంపినట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో మృతిచెందిన వ్యక్తులకు వర్క్ మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం యాజమాన్యం నుంచి పరిహారం అందించే చర్యలు తీసుకుంటున్నట్లు ఈయన తెలిపారు.

వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు ఉద్యమం

భవన నిర్మాణ కార్మిక నేతల పిలుపు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం రూరల్ : భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణ జరిగే వరకూ కార్మికులు పోరాటాన్ని కొనసాగించాలని భవననిర్మాణ కార్మికసంఘం ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. గోదావరి భవననిర్మాణ కార్మికసంఘం సర్వసభ్య సమావేశం శనివారం మాధవరం గ్రామంలో జరిగింది. సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా మండలి భవనంలో తమ యూనియన్ సమావేశాలు జరుపుకోవడానికి అవకాశం ఇచ్చినందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ కు గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా భవననిర్మాణ కార్మికసంఘం గౌరవాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా వెల్ఫేర్ బోర్డు నిర్వీర్యం కావడంతో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, బోర్డు నిర్వీర్యం అయిపోయిందని, కార్మికులు నానా అగచాట్లు పడుతున్నారని అన్నారు. బోర్డు పునరుద్ధరణ చేస్తామంటూ ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళడానికి మొన్న 24 వ తేదీన రాష్ట్రంలోని 24 జిల్లాల్లో వేలాది మంది కార్మికులతో ధర్నాలు జరిగాయని తెలిపారు. అవసరమైతే రానున్న రోజుల్లో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని సోమసుందర్ స్పష్టం చేశారు. భవననిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు సాధన కోసం జరుగుతున్న

ఉద్యమంలో గ్రామీణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సి ఉంటుందని, కార్మికుల ఐక్యత ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దువ్వా శ్రీను మాట్లాడుతూ గత ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర పథకాలకు మళ్లించి కార్మికుల వేలాది క్లెయిమ్ లను పెండింగులో పెట్టిందని అన్నారు. ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను చంద్రబాబు నాయుడు , పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్ళగా తమ ప్రభుత్వం రాగానే కార్మిక సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు కోడె సాయి బాలాజీ, గోదావరి గ్రామీణ భవననిర్మాణ కార్మికసంఘం కార్యదర్శి తాతకుంట్ల శ్రీనివాస్, కోశాధికారి కంకిపాటి రాజు, మాధవరం గ్రామ ఉప సర్పంచ్ బందారు నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు కౌలూరి వెంకన్న , మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి చుక్కయ్య , మాజీ సర్పంచ్ కౌలూరి ప్రమీల, గ్రామ పెద్దలు తమ్మిసెట్టి సుబ్బారావు, రఘు, అరుగొలను యూనియన్ గౌరవ అధ్యక్షులు గోపిరెడ్డి నాగచంద్రరావు , అధ్యక్షుడు సత్యనారాయణ, చంద్రం, తదితరులు మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల నుండి కార్మికులు హాజరయ్యారు.

హరినాథ్‌బాబుకు సత్కారం

విశాలాంధ్ర- ఏలూరు: ఏలూరు నగర పాలక సంస్థలో 43 సంవత్సరాల పాటు ఎటువంటి రిమార్కు లేకుండా పదవీ విరమణ చేస్తున్న సిహెచ్ హరినాథ్‌బాబును నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర బాబు అభినందించారు. ఇంజనీరింగ్ విభాగం వాటర్ సరఫరా విభాగంలో ఎన్ఎంఆర్‌గా చేరి పంపుల చెరువు రెగ్యులర్ పంపు హౌస్ క్లీనర్‌గా, ఫిట్టరుగా, ఎస్సార్ వన్ లో ట్యాప్ ఇన్స్పెక్టర్ గా 43 సంవత్సరాలు సర్వీస్ చేసి పదవీ విరమణ పొందిన చప్పిటి హరినాథ్ బాబును ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి)నాయకులు, కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఉద్యోగ సిబ్బంది ఘనంగా శాలువాలు కప్పి ,పుష్ప గుచ్చాలు ఇచ్చి సత్కరించారు. స్థానిక కోట దెబ్బ పెన్షనర్స్ కళ్యాణ మండపంలో హరినాథ్ బాబు వీడ్కోలు సభ జరిగింది. సభకు ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్ బాబు హరినాథ్‌కు రిటర్మెంట్ బెనిఫిట్స్ లో భాగంగా పిఎఫ్ చెక్కును అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్ బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ పిలగల కొండలరావు, రజాక్, తాతబ్బాయి, వాటర్ సప్లై ఏఈ సాయి యూనియన్ వ్యవస్థాపకులు చిలుకూరి రమేష్ కుమార్ కార్పొరేటర్లు కర్రీ శీను, సబ్బాం శ్రీనివాసు, టీడీపీ నాయకులు హారం అను, కాంగ్రెస్ నాయకులు సప్పిడి గంగాధరరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు తదితరులు మాట్లాడుతూ హరినాథ్ బాబు పదవీ విరమణ అనంతరం ఏలూరు నగర ప్రజలకు మంచినీరు సరఫరా విభాగంలో తమ సేవలను అందించేందుకు కొంత సమయం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఉద్యోగ సిబ్బంది, వివిధ సచివాలయాల ఉద్యోగ సిబ్బంది పదవి విరమణ పొందిన అనేకమంది ఉద్యోగ సిబ్బంది హరినాథ్ బాబు బంధు మిత్రులు అధిక సంఖ్యలో హాజరై హరినాథ్ బాబు దంపతులను ఘనంగా సత్కరించారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION): KAIKALURU

I.A.No. 360/2023 in O.S.No.47/2018

1. Chavali Brahmaramba
2. Tippabhotla Suguna Janaki (Died)
3. Chavali Sankara Sastry
4. Tippabhotla Mounika.

- Petitioners/Plaintiffs

AND

1.Chavali Suryanarayana Murthy
2. Chavali Venkata Rama Gopala Krishna Murthy
3. Guduru Annapurna (Died)
4. Jakka Sivannarayana
5. Chavali Surya Kumari
6. Chavali Naga Lakshmi (Died)
7. Chavali Lakshmi Syamala Prasunamba
8. Iluri Devi @ Parvathi Subba Lakshmi
9. Mamillapalli Vijaya Lakshmi
10. Chavali Saradha Devi.

- Respondents/Defendants

To :

R-8. Iluri Devi @ Parvathi Subba Lakshmi, W/o. Gopala Krishna, C/o. Tada Village of Tirupati District, Tirupati JCJC.. R/o. Tada

R-9. Mamillapalli Vijaya Lakshmi W/o.M.V Satya Kumar, R/o. D.No.2-49, Near Dogala Mandapam, Kaikalur Bypass, Eluru Town and Mandal, Eluru District, Eluru JCJC

పై నెంబరు దావాను వాదులు ప్రతివాదులపై పార్టిషన్ నిమిత్తం దాఖలు చేసియున్నారు. ఇట్టుండగా 3వ ప్రతివాది చనిపోయినందున వారి వారసులుగా **8, 9, 10 ప్రతివాదులను** యాడ్ చేయమని పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు **పిటిషన్‌లో 8, 9వ రెస్పాండెంట్లకు** నోటీసులు పంపినను **8, 9వ రెస్పాండెంట్లు** పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నందున పబ్లికేషన్ ద్వారా నోటీసులు అమలుకు శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. సదరు ఉత్తర్వుల ప్రకారం మీరు **ది.10.03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు** పైకోర్టు నందు స్వయముగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరై అక్షేపణలున్న తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి ఉత్తర్వులు పొందబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఉదయ్ శంకర్, పి.పవన్నాథ్
పిటీషనర్ల తరపు న్యాయవాదులు,
9490339161
తేది : 28-02-2025

PASSPORT LOST

I, GORLA SRINIVASA RAO, S/o VENKATA RAMA RAO, D.No.3-3/1, Ramalayam Street, Yendagandi Village, Undi Mandal, W.G.Dt., I have recently lost my original PASSPORT with bearing No. **G7569420** lost by me on **18-01-2025** while I am going from my House to xerox shop Bhimavaram Taluq Office Center. So if anybody finds kindly inform to above address.

ప్రాజెక్టులో తేనెటీగలు దాడి

విశాలాంధ్ర - పోలవరం : పోలవరం ప్రాజెక్టులో శనివారం ఇద్దరు వ్యక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. పోలవరం పరిసర ప్రాంతాల్లో పశువులకు మేతలేక పోలవరం ప్రాజెక్ట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొంతమంది రైతులు మేత మేయడానికి వదిలేశారు. ఆ పశువులు చుట్టుపక్క ప్రాంతాల్లో మేసి సాయంత్రానికి ప్రాజెక్టు సమీప ప్రాంతానికి చేరుకుంటాయి. ఉదయం, సాయంత్రం రైతులు వెళ్లి అక్కడ పశువులను చూసి పాలు తీసుకుని పోలవరం చేరుకుంటారు. దీనిలో భాగంగానే ఉదయం యధావిధిగా తండ్రి కొడుకులు పశువుల వద్దకు వెళ్లే సమయంలో 901 కొండ వద్ద అటవీ తేనెటీగలు ఒక్కసారిగా చుట్టుముట్టాయి. ఏం చేయాలో తెలియక అదే ప్రాంతంలో తండ్రి కొడుకులు కూర్చుని పోయారు. తేనెటీగలు విపరీతంగా కుట్టడంతో ప్రాజెక్టులో కొంతమంది తండ్రి,కొడుకులను పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు సునీల్ తండ్రి, కొడుకులకు వైద్యం చేసి తలలో ముఖంపై కుట్టిన తేనెటీగలు తీసివేశారు. కొడుకుకు ప్రమాదం ఏమీ లేదని, తండ్రి సోమరౌతూ శ్రీనుకు ముఖంపై బాగా తేనెటీగలు కుట్టడంతో 108 లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - సీతానగరం: ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు. మండలంలో సీతానగరం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థులను పరీక్ష కేంద్రానికి వెళ్ళే ముందు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రానికి చుట్టూ పక్కల జిరాక్స్ సెంటర్లను మూసివేశారు. మొదటి సంవత్సరం 314 మంది హాజరు కావాల్సి ఉండగా 13 మంది గైర్హాజరు కావడంతో 301 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు రఘుదేవపురం సత్య ప్రభ, వెదుళ్ళపల్లి జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు.

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా హీరాలాల్

విశాలాంధ్ర - నిడదవోలు : తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా అగర్వాల్ హీరాలాల్ ను నియామించినట్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దాంతోపాటు ఆర్ఎస్ఎస్ బావాజాలంతో ఉన్న కేంద్రంలోని బీజేపీ, రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్న, మరో రాజ్యాంగాన్ని తీసుకురా డానికి కుటిల ప్రయత్నాలు చేస్తుందని, బీజేపీ కుటిల రాజకీయాలను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంలో తన వంతు సహకారం అందిస్తానని అగర్వాల్ హీరాలాల్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాకు ఈ పదవికి సహకరించిన ప్రధాన కారకులు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టి కే విశ్వేశ్వర్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, చిన్నం మురళీకృష్ణ, కోఆర్డినేటర్ కారింకి వెంకటేశ్వరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌గా విజయశాంతి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కరుటూరి రఘునాద్ చౌదరి భార్యనిమ్మగడ్డ విజయశాంతి హైకోర్టు అడ్వకేట్ రాయలసీమ యూనివర్శిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా హైకోర్టులో నియమితులయ్యారు. ఈ పదవి రావటానికి సహకరించిన ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, యవనేత లోకేష్ బాబుకి, కోత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుదప కృష్ణమూర్తి, సెంట్రల్ డేల్టా ప్రాజెక్ట్ వెస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, గ్రామ సర్పంచ్ యమ్ రాజు, మండల తెలుగురైతు అధ్యక్షుడు కరుటూరి వరప్రసాద్, కరుటూరి కిరణ్ తదితరులు హర్షం వ్యక్తం చేసారు.

లబ్ధిదారులకు కలెక్టర్ పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: బెడ్ రీడెన్ లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పెన్షన్ పంపిణీ చేశారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ మండలం బూరుగుపూడి పంచాయతీ పరిధిలో పలువురు బెడ్ రీడెన్ సామాజిక భద్రత పెన్షన్ దారులకు శనివారం కలెక్టర్ పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో 2 లక్షల 35 వేల 344 మంది లబ్ధిదారులకు రూ.102 కోట్ల 4 లక్షల 19 వేల 500లను పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకి 2,14,336 మందికి రూ.92 కోట్ల 65 లక్షల 28 వేల 500లని నగదు చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. పెన్షన్ లబ్ధిదారులు ఎవరూ కూడా ఇబ్బం దులు పడకుండా శనివారం ఉదయం నుండి లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుం దన్నారు. లబ్ధిదారులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆశీర్వాద్ పథకం వృద్ధులకు ఎంతో మేలు : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : అపోలో ఆసుపత్రి ప్రవేశ పెట్టిన ఆశీర్వాద్ పథకం పిల్లలు ఎక్కడో దూరంగా ఉన్న ఉండి అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధ తల్లిదండ్రులకు ఎంతో మేలు కలుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. శనివారం అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో కాకినాడలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆశీర్వాద్ పథక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ పథకం సంబంధించి అపోలో రీజనల్ సీఈవో సుబ్రహ్మణ్యం వివరించారు. నడవలేని కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు టెలి మెడిసిన్, టెలికాలర్ ద్వారా తెలుసుకొని వారికి వైద్య సహాయం అందించవచ్చున్నారు. ముఖ్యఅతిథి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఈ పథకం విదేశాల్లోనూ దూరంగా ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తాను కాకినాడలో పనిచేస్తున్నా కడపలో ఉన్న తన తల్లిదండ్రులు అనారోగ్యంనకు గురైతే వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఈ పథకం అలాంటి వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటికి వెళ్లి వైద్యం అందించడం ద్వారా వారు ఎటువంటి అనారోగ్యం గురయ్యారో తెలుసుకొని వైద్యంతో నయం చేసేందుకు మేలు కలుగుతుందని కలెక్టర్ చెప్పారు. అనంతరం అపోలో ఆశీర్వాద్ బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంకు అపోలో ఏవో ఐవి రమణ, మార్కెటింగ్ హెడ్ అంజిబాబు, సిబ్బంది హాజరయ్యారు.

రాష్ట్ర పునఃనిర్మాణం దిశగా బడ్జెట్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : రాష్ట్ర పునఃనిర్మాణం చేసేలా నేడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనా విధానాలకు అనుగుణంగా, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అధికంగా కేటాయింపులు చేసిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ రూపొందించడం చాలా సంతోషంగా ఉందని వెల్లడించారు. 3.22 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల వారికి ప్రయోజనం చేకూర్చేలా ఉందని సత్యానందరావు పేర్కొన్నారు. వ్యవసాయ బడ్జెట్ రూ.48 వేల కోట్లు పాఠశాల విద్యాశాఖ-రూ.31,806 కోట్లు, బీసీ సంక్షేమం-రూ.23,260 కోట్లు, వైద్యారోగ్య శాఖ-రూ.19,265 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ-రూ.18,848 కోట్లు, జలవనరుల శాఖ-రూ.18,020 కోట్లు, అలాగే వివిధ రంగాలకు కేటాయించడం జరిగిందన్నారు. తెలుగుదేశం, జనసేన, భాజపా ప్రభుత్వం ప్రజలకు అనుగుణంగా 2025-26 బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలని నిరసన

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని తాటిపాక గ్రామంలో హత్యకు గురైన గుమ్మడి కుమార్ స్వామి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, సంఘ పెద్దలు శనివారం రాజోలు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నుండి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై బైటాయించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ముట్టడించి హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు హత్య జరిగి నెలరోజుల పైబడిన ఇంతవరకు నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ కార్యక్రమంలో మృతుని తల్లిదండ్రులు గుమ్మడి నాగరాజు, బుజ్జి, స్థానిక పెద్దలు సారిక ఆంజనేయులు, సారిక వెంకట శ్రీనివాస్, అంతర్వేది పుల్లయ్య, వాకలపూడి రాము తదితరులు పాల్గొన్నారు. సిఐ హామీతో ఆందోళన విరమణ గుమ్మడి కుమార్ స్వామి కేసు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని సిఐ నరేష్ కుమార్ ఆందోళన కారులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉచిత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - కడియం : ప్రపంచ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శనివారం కడియం పోలీస్ స్టేషన్ సీఐ ఎ వెంకటేశ్వరరావు కోరక మేరకు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుల్స్‌కు మహిళలకు, ఉచితంగా రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. మినర్వా పాఠశాల పదవ తరగతి విద్యార్థినీలకు ఆరోగ్య పరిరక్షణ పెంపొందించే విషయాలను, పరీక్షలు భయం లేకుండా వ్రాయుటకు మనోధైర్యాన్ని నింపుతూ అవగాహన కల్పించారు. మహిళా ఎస్ఐ ధనలక్ష్మి ప్రసన్న పర్యవేక్షణ చేయగా మహిళా సిబ్బంది సహకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దుర్గా ప్రసాద్, రైటర్ కె సురేష్ బాబు, హెడ్ కానిస్టేబుల్ రమణ, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బళ్ళా శ్రీనివాసరావు, పి దేవానందం, రాజమండ్రి శాఖ కోశాధికారి యు ప్రసాద్ బాబులు వైద్య సేవలందించారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట పట్టణ శివారు ప్రత్తిపాడు జంక్షన్ సిబిఎం సెంటర్ ప్రాంతంలో తేనెటీగలు దాడి చేసిన ఘటనలో సుమారు 25 మంది గాయాల పాలయ్యారు. శనివారం మధ్యాహ్నం సమయంలో సిపిఎం సెంటర్ ప్రాంతంలో వివిధ పనులు నిర్వహించుచున్న వారిపై తేనెటీగలు ఒక్కసారిగా లేచి దాడి చేశాయి. ఈ ఘటనలో ఆయా ప్రాంతంలో పలువురు ప్రయాణికులు, చిరు వ్యాపారులపై కేబుల్ పనులు నిర్వహిస్తున్న పలువురు టెక్నీషియన్ పై తేనెటీగలు తీవ్ర స్థాయిలో దాడి చేశాయి. తేనెటీగలు దాడిలో గాయపడిన వారు హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రి వెళ్ళగా వైద్యులు చికిత్సను అందజేశారు.

చెత్త నుంచి సంపదపై అవగాహన

విశాలాంధ్ర - కరప : కరప మండలం వివిధ గ్రామ పంచాయతీలలో చెత్త కలెక్షన్ చేయడం అనుసరించవలసిన విధానాలపై అవగాహన కల్పించుట జరిగింది. ఈ కార్యక్రమానికి డీఎల్పీవో అన్నామణి విచ్చేసి నడకుదురు, పాతర్లగడ్డ, పెద్దాపురం పాడు, విజయ రాయుడుపాలెం, గ్రామ పంచాయతీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్డబ్ల్యుపిసి షెడ్లను పరిశీలించి తడి పొడి చెత్తలను వేరు చేసి తడి చెత్త ద్వారా చెత్త నుంచి సంపద కేంద్రాలలో కంపోస్టు ఎరువులు తయారుకి వినియోగించాలన్నారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి సలాది శ్రీనివాసరావు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శులు, వీరభద్రరావు, వరిజ, తదితరులు పాల్గొన్నారు.

94 శాతం పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలంలో మార్చి 1 శనివారం తొలిరోజే 94 శాతం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. మండలంలో మొత్తం పెన్షన్లు 8341 మందికి 7833 మందికి పంపిణీ చేశారు. అన్ని గ్రామాలలో పెన్షన్ లబ్ధిదారులకు ఇంటివద్దకు వెళ్ళి పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నట్లు నాతి బుజ్జి తెలిపారు. గండేపల్లి మండలం మొత్తానికి 3 కోట్ల.62 లక్షల పెన్షన్ సొమ్ము మంజూరు కాగా 7833 మందికి గానూ పింఛన్ నగదు రూ. 3 కోట్ల 39 లక్షల రూపాయల పంపిణీ చేసి 94%తో గండేపల్లి మండలములో పెన్షన్ పూర్తి చేశారు. పెన్షన్ పంపిణీ చేసిన అధికారులను, సిబ్బందిని ఎంపీడీఓ అభినందించారు. పెన్షన్ పంపిణీని ఎంపీడీఓ పరిశీలించారు.

వ్యక్తి గత భద్రతపై అవగాహన

విశాలాంధ్ర - సామర్లకోట : విద్యార్థి దశ నుండి వ్యక్తిగత భద్రత, రోడ్డు సేఫ్టీ పై అవగాహన ఏర్పరుచుకోవాలని వెంకట్రామ ఆయిల్ ఇండస్ట్రీ జనరల్ మేనేజర్ ఎన్ రామమోహనరావు పేర్కొన్నారు. శనివారం ఉదయం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో ప్రధానోపాధ్యా యులు తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వెంకట్రామ ఆయిల్ ఇండస్ట్రీ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విలువైన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సాయిరామ కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు, వివిధ పరిశ్రమల్లో భద్రతకు తీసుకొనే ఏర్పాటు గురించి అవగాహన కల్పించడం వీలవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలోని కూడా గ్యాస్ స్టవ్ వినియోగము రక్షణ చర్యల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వై సత్తిరాజు ప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు ఏఎల్వి కుమారి, కే శ్రీనివాస్, వి రాజు, జి గోవిందు, డ్రాయింగ్ మాస్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

విశాలాంధ్ర - కరప : జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి నెల 31వ తేదీ వరకు గాలుకుంటూ వ్యాధి, బ్రూసెల్లోసిస్, వ్యాధులకు టీకాలు వేయడం జరుగుతుందని కరప వెటర్నరీ ఏడి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శనివారం కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆర్ వెంకటేశ్వరరావు కరప గ్రామంలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి గోడ పత్రికను ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువులలో ఆవులు, నాలుగు నెలలు వయసు కలిగిన దూడలు, గేదెలు, దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పసు రైతులకు విజ్ఞప్తి చేశారు. పశుసంవర్ధక శాఖ ఉపసంయుక్త సంచాలకులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ కాకినాడ రూరల్, కరప మండలంలో 25950, గాలికుంటు టీకాలను సిద్ధం చేశామని 830 ఆడదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలను వేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

95.17 శాతం పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కాకినాడ నగరపాలక సంస్థలో మార్చి ఒకటో తేదీ శనివారం సాయంత్రానికి 95.17 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకే 50 శాతం పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు. సాయంత్రానికి 95.17 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయడం విశేషమన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 29,427 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా. వారిలో 28007 మందికిగాను రూ.120333500 సొమ్ము పంపిణీ చేశామని తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచే పింఛన్లను ఆయా లబ్ధిదారులకు అందజేసినట్లు వెల్లడించారు.

పారిశుధ్యంతో ప్రజారోగ్యం

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రామాలలో మెరుగైన పారిశుధ్య పనులను నిర్వహించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారిని శాంతామణి తెలిపారు. శనివారం గోపాలపురం మండలంలోని గోపాలపురం చిట్యాల వేల చింతల గుడి గ్రామాలలో ఆమె ఆకస్మిక తనిఖీ చేసి గ్రామాలలో పారిశుద్ధ్యాన్ని నిర్వహిస్తున్న విధానాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా శాంతమణి, మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ చెత్త సేకరణను నిర్వహించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యదర్శులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండి పౌర సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ, ఎంపీడీవో బివిఎస్ శ్రీనివాస్, గోపాలపురం చిట్యాల, వేళ్ళచింతలగూడెం కార్యదర్శులు అనురాధ, అలేఖ్య సువర్చల, వెంకటరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు

విశాలాంధ్ర - నిడదవోలు :ఇంటి వద్దే లబ్ధిదారులకు అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయడంలో మంచానికే పరిమితమైన లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సూక్ష్మ సేద్య అధికారి, మండల ప్రత్యేక అధికారి ఏ దుర్గేష్ అన్నారు. నిడదవోలు మండల పరిధిలో అందజేస్తున్న 10,310 మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి ఏ దుర్గేష్ క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించారు. నిడదవోలు మండలం గోపవరం, డి ముప్పవరం, సమిశ్రగూడెం గ్రామాలలో బెడ్ రిడెన్ కేసు లకు ఇంటి వద్దనే పెన్షన్ల ను అందచేశారు. పెన్షన్ల పంపిణీ తీరును మంచానికే పరిమితమైన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సామాజిక భద్రత పెన్షన్లను ఇంటి వద్దనే పంపిణీ చేయడంలో భాగంగా బెడ్ రిడెన్ కేసుల ఇంటి వద్దకే అధికారులు వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో డీ.. లక్ష్మీ నారాయణ, గ్రామ కార్యదర్శులు కే శ్రీనివాసరెడ్డి, భార్గవి దేవి, వివి నాగాంజనేయులు, పెన్షన్ల పంపిణీ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ మద్యం బాటిళ్ల స్వాధీనం

విశాలాంధ్ర - కాకినాడ : ఖాళీగా ఉన్న మద్యం సీసాలో స్థానిక మద్యాన్ని నింపుతూ విదేశీ మద్యం అంటూ విక్రయాలు చేస్తున్న ఇరువురిని అరెస్ట్ చేసి వారి నుండి 46 మద్యం బాటిళ్లను కాకినాడ త్రీ, క్రైమ్ పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. శనివారం దీనికి సంబంధించిన వివరాలను త్రీటౌన్ సీఐ కెవిఎస్ సత్యనారాయణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో విలేకరులతో సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ సాంబమూర్తి నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ సలీం భాషా, కాకినాడ బ్యాంక్ పేటకు చెందిన శీలం రామకృష్ణలు గత మూడు నెలల నుంచి డబ్బు సులువుగా సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ నుంచి ఖాళీ విదేశీ మద్యం బాటిల్లను సేకరించి కాకినాడలో దొరికే ఇండియన్ మేడ్ విస్కీ లిక్కర్ బాటిళ్లను కొని ఒక పరికరంతో ఖాళీ సీసాలోకి మందును నింపి విదేశీ బాటిళ్ళంటూ ఎక్కువ నగదుకు అమ్మేవారన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాము నిఘాను ఏర్పాటు చేయగా ఈ విషయం తమ దృష్టికి రావడంతో వారిద్దరిని శుక్రవారం బ్యాంకు పేటలో అరెస్ట్ చేసామని సిఐ సత్యనారాయణ చెప్పారు. అరెస్ట్ చేసిన ముద్దాయిలను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సిఐ పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాకినాడ త్రీ టౌన్ లాండ్ ఆర్డర్ ఎస్సై కే విజయ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిచెట్టు వెనుక రహస్యం ఏమిటో?

విశాలాంధ్ర - జగ్గంపేట : గోకవరం రోడ్డులోని మర్రిచెట్టు వెనుక రహస్యం దాగి ఉందనే విషయం బట్ట బయలవుతుంది. వివరాల్లోకి వెళితే జగ్గంపేట నుండి గోకవరం వెళ్లే రోడ్డులో ప్రక్కనే ఎన్నో ఏళ్ల నాటి మర్రి, చింత చెట్లు ఉన్నాయి. అలాగే ఆ రహదారిలో రెండు కళ్యాణ మండపాలు ఉన్నాయి. ఆ కళ్యాణ మండపం ఎదురుగా పెద్ద వృక్షం, ఇళ్ళు ఉన్నాయి. శుభకార్యాలు జరిగే సమయాల్లో చెట్టు నీడ కోసం వాహనాలను ఆ వృక్షం క్రింద పెట్టుకునేవారు. ఇలా గత కొన్నేళ్ళుగా జరుగుతుంది. ఐతే ఆ వెనుక ఇంటి వారికి మర్రి వృక్షం అడ్డు రావడంతో నిప్పు పెట్టేశారని బహుజన్ సమాజ్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జి జుత్తుక నాగేశ్వరరావు ఆరోపించారు. దీనిపై ఆర్ అండ్ బి ఎఈ సాయి కిరణ్ను వివరణ కోరగా గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ జరిగినప్పుడే చెట్లను తొలగించాల్సి ఉందని, ఆ కాంట్రాక్టర్ చెట్లకు డబ్బులు చెల్లించాడన్నారు. ఐతే ఈ మర్రిచెట్టు విషయానికి వస్తే చెట్టు కాలిపోయిందని తీసేస్తామని ఆ ప్రక్క ఇంటి వారు చెప్పడంతో మేమే తొలగించమని చెప్పామన్నారు. రోడ్డు ప్రక్కన మిగిలిన ఉన్న చెట్లను మరో 2 నెలల్లో తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే ఈ రోడ్డును నాబార్డులో నిర్మించేందుకు నిధులు కోసం అంచనా తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. నిధులు మంజూరు చేసే నాబార్డు అధికారులు రోడ్డును పరిశీలిస్తారన్నారు. వారు వచ్చే సమయానికి చెట్లు పూర్తిగా తొలగించాల్సి ఉంటుందన్నారు. ఎప్పటికైనా తొలగించాల్సిందే కాబట్టి ఈ చెట్టును ముందుగానే తొలగించినట్లు వివరణ ఇచ్చారు.

ఆడపిల్లలు మగవారితో సమానం : సీఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : ఆడపిల్లలు మగవారితో సమానమే అని వారితో సమానంగా ఉన్నత చదువులు చదివి మీ కాళ్ళ మీద మీరు నిలబడాలని జగ్గంపేట సీఐ వైబర్ కె శ్రీనివాస్ విద్యార్థినులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వారోత్సవాలను శనివారం జగ్గంపేట మండలం రాజపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ అధికారిణి ఎం పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు మగ పిల్లలతో సమానమే అన్నారు. మీరు 10వ తరగతితో చదువు ఆపేయకుండా డిగ్రీ వరకు చదివి ఉద్యోగాలు పొంది మీ కాళ్ళపై మీరు నిలబడే స్థాయికి ఎదగాలన్నారు. సిడిపిఓ మాట్లాడుతూ బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టాలని, ఆడపిల్లలు దేశానికి కల్పవల్లులు అన్నారు. ఆడపిల్లల పెళ్లి వయస్సు 18 సంవత్సరాలు అని, బాల్య వివాహాలు చేస్తే 1098 నెంబర్ కాల్ చేయాలన్నారు. అలాగే అందుబాటులో ఉండే మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలకు తెలియ జేయాలన్నారు. అంగన్వాడీ పరిధిలోని ముగ్గురికి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి, వారితో మొక్కలు నాటించారు. తదుపరి ప్రజలకు అవగాహన కల్పించే దుకు సీఐ విద్యార్థినులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ ర్యాలీకి సిడిపిఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎస్ అమ్మాజీ, హెడ్మాస్టర్ ఏ ధర్మరాజు, అంగన్వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, జి కృష్ణ వేణి, ఈ సుబ్బలక్ష్మి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నాగేంద్ర

విశాలాంధ్ర - జగ్గంపేట : హిందూ ధర్మ రక్షణకు పాటుపడుతున్న పాలచర్ల నాగేంద్ర చౌదరిని భారతీయ ధర్మపరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో శనివారం జరిగిన భారీ హైందవ శంఖారావం సభలో ఆ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకృష్ణ శరణానందభారతి వారు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు పోడుకు ప్రసాద్ ఆచార్యులు నాగేంద్రకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి నాగేంద్ర దంపతులను ఘనంగా సత్కరించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ నాగేంద్రను ఫోన్లో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన నాకు మరింత బాధ్యతనిస్తూ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడిగా ప్రమోట్ చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మరింత బాధ్యతతో హిందూ ధర్మ పరిరక్షణ కోసం పని చేస్తానన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకునే దిశగా బడ్జెట్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : గత వైసీపీ పాలకుల చేసిన విధ్వంసాల నుంచి పునరుద్ధరింప చేసే దిశగా అనేక సవాళ్లు అధిగమించి పునర్నించే దిశగా ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఏపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా ఉందని ప్రజల ఆకాంక్షలకి అనుగుణంగా బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమం ఇప్పటికే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల కోసం ఎప్పుడైనా ఈ విధంగా బడ్జెట్లో కేటాయింపు చేశారని ఆయన ప్రశ్నించారు. అన్ని వర్గాలని, ముఖ్యంగా వ్యవసాయ రంగం ఆదుకునే దిశగా ఈ బడ్జెట్ ప్రవేశ పెట్టడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. 48 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, మామిడిశెట్టు శ్రీను, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

వాడపల్లి బ్రిడ్జి ఓ మధుర జ్ఞాపకం : రెడ్డి సుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుపతి వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో ఉన్న కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేయడం ఓ మధుర జ్ఞాపకమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. 2018 సంవత్సరంలో తాను శాసనమండలి ఇన్చార్జి చైర్మన్గా ఉన్న సమయంలో బ్యాంక్ కెనాల్పై బ్రిడ్జి నిర్మాణంకు ఎంతో కృషి చేశానని చెప్పారు. ఇందుకోసం మోడరైజేషన్ నిధులు కోటి 98 లక్షల నిధులతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టామన్నారు. శనివారం వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఆయన కాలినడకన కొత్తపేట నుండి వాడపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో అలసిపోయిన ఆయన కాసేపు తాను కృషి చేసి నిర్మించిన బ్రిడ్జిపై కూర్చుని సేద తీరారు. ఈ సందర్భంగా అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. భక్తుల ఇబ్బందులను చూసి కాలుపై వంతెన నిర్మాణం చేయడం జరిగిందని చెప్పారు. ఈ వంతెన నిర్మించిన తర్వాత వాడపల్లి ఆలయానికి భక్తుల సంఖ్య పెరుగుతూ వచ్చిందన్నారు.

బాధితులను పరామర్శించిన గిరిబాబు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలో ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో గిరిబాబు పర్యటించి వైసిపి కార్యకర్తలను కలిశారు. రాచపల్లి గ్రామంలో ఇటీవల కాలంలో రోడ్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించి యోగక్షేమాలును అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులు మెరుగైన వైద్యం అందించేలా వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలన్నారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వంలో కష్టాలే మిగిలాయన్నారు. నియోజకవర్గంలో ప్రజలు పడుతున్న సమస్యలను తెలుసుకోవడానికి త్వరలోనే అన్ని గ్రామాల్లో పర్యటిస్తానని గిరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బదిరెడ్డి గోవింద్, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, సారిపల్లి గంగరాజు, ఒమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తజనంతో వాడపల్లి వెంకన్న క్షేత్రం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామికి నీరాజనం, మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణ మంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. శనివారం స్వామి ఆదాయం రూ.44,31,149లు సాయం త్రం ఐదు గంటల వరకు వచ్చిన ఆదాయం. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెంట్ పి. రాంబాబు వర్మ, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు(గబ్బర్ సింగ్), లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. ఎస్ఐ ఎస్ రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు

అమరుల త్యాగాలు మరువలేనివి : రాజు

విశాలాంధ్ర - కొవ్వూరు : షెడ్యూల్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణకు అమరులైన మాదిగ అమరవీరుల ప్రాణ త్యాగాలు మరువలేనివని దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు అన్నారు. మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొవ్వూరు పట్టణంలోని మెరక వీధి బాబు జగజీవన్రామ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కులవర్గీకరణ పోరాటంలో అమరులైన ప్రాణ త్యాగాలు చేసిన మాదిగ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల రిజర్వేషన్ కులగణన చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం మాదిగ అమరవీరుల త్యాగాల ఫలితం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమరులైన వారి కుటుంబాలకు ఎక్స్గ్రేషియా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుంధతి ఉద్యోగ సంఘాల నాయకులు పెనుమాక జయరాజు, కొడమంచిలి విజయ్ కుమార్, పెద్దద ఏసు బుజ్జి, కొడమంచిలి రమణ, చిలి ప్రసాద్, మారలపూడి అచ్చిబాబు, మల్లిపూడి కిషోర్, తదితరులు పాల్గొన్నారు. మాదిగ అమరవీరుడు సిర్ర నాగేశ్వరరావు కుమారుడు సిర్ర రాజేంద్రప్రసాద్ను దళిత సంఘాలు సత్కరించుకున్నాయి.

ప్రత్యేక పారిశుధ్య చర్యలు

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం, వేమగిరి గ్రామపంచాయతీ పరిధిలో, ఆ గ్రామ కార్యదర్శి ఎం రూప్ చంద్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్వి రాంప్రసాద్ విచ్చేసి పరివేక్షించారు. తడి పొడి చెత్త సేకరణకు సంబంధించి ఇంటింటికి విస్తృత ప్రసారం నిర్వహించాలన్నారు. అందుకు అవసరమైతే ఫ్లెక్సీలు, మైకుల ద్వారా ప్రసారాలు చేపట్టాలని రాంప్రసాద్ సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా సేకరించిన చెత్తను ఏ విధంగా వినియోగిస్తున్నారనేదానిపై రాంప్రసాద్ పరిశీలించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

విశాలాంధ్ర - గోపాలపురం : నేటి నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు 596 మంది హాజరు కావలసి ఉండగా 569 మంది హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరింటెంట్ కె ఎం కె ఆర్ కుమారస్వామి తెలిపారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు. నేటి నుండి ఈ నెల 15 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలు మండలంలో రెండు పరీక్షా కేంద్రాలకు అనుమతి ఉందని, అందులో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో మొదటి రోజు 309 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా , 296 మంది విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది గైర్హాజరైనట్లు సీఎస్ తెలిపారు. అదేవిధంగా శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం 287 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా వారిలో 271 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సెంటర్ చీఫ్ సూపరిండెంట్ (సి ఎస్) కే.ఎం.కె. ఆర్ కుమార స్వామి, డిఓడి. రాజులు తెలిపారు. పరీక్షల సమయంలో వైద్య ఇతర సదుపాయాలు కల్పించినట్లు ఆయన తెలిపారు.

దొమ్మా శ్రీను జన్మదిన వేడుక

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, టీడీపీ గండేపల్లి మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్ రావు, టిడిపి జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షులు మారిశెట్టి భద్రంల ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం దొమ్మా శ్రీను అభిమానులు కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉచిత కళ్ల జోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో గంగలకుర్రు, సిరిపల్లి, చిందాడగరువు గ్రామాల్లో మెడ్ యునైటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడి కల్ క్యాంపులో కళ్ల సమస్యలు గుర్తించి కళ్లద్దాల అవసరమైన వారికి శనివారం కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. సర్ సివి రామన్ డైరెక్టర్ అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ రవణం వేణుగోపాల్రావు, జాకర్రాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అమలాపురం లయన్స్ క్లబ్ ఐ విజన్ ట్రెజరర్ లయన్ జంపన సుమన్ వర్మ ఆర్థిక సహాయంతో ఉచితంగా 35 మందికి కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, ఐ విజన్ ట్రెజరర్ లయన్, జంపన సుమన్ వర్మ, జోనల్ చైర్ పర్సన్ లయన్ మల్లికార్జున స్వామి, లయన్ అరిగెల బలరామ్మూర్తి, లయన్ గుర్రం రామకృష్ణ, లయన్ పట్నాల వెంకటరమణ, లయన్ రాచకొండ దుర్గారావు, అమలాపురం లయన్స్ క్లబ్ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

తిరుపాన్యంపై ఆరోపణకు ఖండన

విశాలాంధ్ర - కాకినాడ : పీఆర్ కాలేజ్ ప్రిన్సిపాల్ తిరుపాన్యంపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ జాయింట్ కలెక్టర్కి వినతిపత్రం అందచేసిన పూర్వపు విద్యార్థులు. గత కొంత కాలంగా కాకినాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బివి తిరుపన్యంపై వస్తున్న పలు ఆరోపణలు ఖండిస్తూ వారి దగ్గర చదువుకున్న వందలాది మంది పూర్వపు విద్యార్థులు శనివారం కాకినాడ కలెక్టరేట్లో బివీ తిరుపాన్యంతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, గురువుగా ఆయన చేసిన సేవలను, ఆయన మంచితనాన్ని వివరిస్తూ జయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి, జిల్లా రెవెన్యూ అధికారికి గురువుకి న్యాయం జరగాలి అని వినతి పత్రం అందజేయడం జరిగింది. వినతి పత్రంతో పాటు విద్యార్థులు అందరూ వారి వారి వ్యక్తిగత అనుబంధాన్ని లెటర్లో రాసి జా యింట్ కలెక్టర్కి ఇవ్వడం జరిగింది. జేసీ రాహుల్ మీనా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన పూర్వ విద్యార్థులు కిషోర్, నళిని కాంత్, కుశ రాజు, నాగేంద్ర, సుబ్రహ్మణ్యం, వెంకట్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 56 మంది గైర్హాజరు

విశాలాంధ్ర - జగ్గంపేట : శనివారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 56 మంది గైర్హాజరు అయ్యారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 504 మందికి 478 మంది హాజరయ్యారని, 26 మంది గైర్హాజరు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. అక్షర జూనియర్ కళాశాలలో 408 మంది ఉండగా 394 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరు అక్షర కరస్పాండెంట్ రవి కిషోర్ చెప్పారు. అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 368 మందికి ఏర్పాటు చేయగా 352 మంది హాజరయ్యారని 16 మంది గైర్హాజరైనట్లు ఆ ప్రిన్సిపాల్ తెలిపారు.

పన్నుల వసూళ్ల లక్ష్యం పూర్తి చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : పన్నుల వసూలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు శ్రద్ధగా పనిచేసి..ఈ నెలాఖరు నాటికి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. పేరుకుపోయిన మొండిబకాయిల వసూల కోసం నగరపాలక అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మార్చి నెలాఖరు నాటికి మొండిబకాయిల వసూల కోసం డివిజన్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వారం వారం రెవెన్యూ వసూళ్లపై సమీక్షించారు. ఎంత మేర పురోభివృద్ధి సాధించారనే విషయంపై ఆరా తీస్తున్నారు. దానిలో భాగంగానే కమిషనర్ భావన ఐఏఎస్ శారదమ్మగుడి వద్ద గల నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించవద్దని కమిషనర్ భావన సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నెలాఖరు నాటికి పన్నుల వసూలు చేయాలన్నారు. ముఖ్యంగా పన్నుల చెల్లింపు విషయంలో ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి వార్డులో నియమించిన నోడల్ ఆఫీసర్, అడ్మిన్, సెక్రటరీలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఆయా డివిజన్లలో మొండిబకాయిదారుల నుంచి పన్నులను వసూలు చేయడంలో వీరందరూ ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. నీటి పన్నులు చెల్లించని మొండిబకాయిదారుల ఇళ్ల వద్ద కుళాయిలను కనెక్షన్‌ను తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, ఆర్ఓ శిరీష్, టీపీఆర్వో శైలజ, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు, సచివాలయాల ఇన్‌చార్జులు, నోడల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ రాజు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ జిల్లా నూతన పౌరసరఫరాల శాఖ అధికారిగా నియమితులైన ఆర్ఎస్ఎన్ సత్యనారాయణ రాజు శనివారం కాకినాడ పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ ఏఎస్వో, సీఎస్డీటీలు ఇతర సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జోయాలుక్కాస్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : భారతదేశం-జోయాలుక్కాస్, వరల్డ్స్ ఫేవరెట్ జ్యువలర్, కాకినాడలో ప్రపంచ స్థాయికి చెందిన తమ షోరూంను గొప్పగా పునః ప్రారంభించింది. కార్యక్రమానికిజోయాలుక్కాస్ గ్రూప్ సీనియర్ మేనేజ్మెంట్ హాజరయ్యారు. ప్రారంభోత్సవంలో ప్రత్యేకమైన ఫస్ట్-లుక్ కలక్షన్స్, ప్రత్యేకమైన ప్రారంభోత్స వపు డిస్కౌంట్లు, అభినందనపూర్వకమైన డిజైనులు ఉన్నాయి. జోయాలుక్కాస్, ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, జోయాలుక్కాస్ గ్రూప్, ఈ విజయం పై తన అభిప్రాయాలు తెలిపారు. మా కొత్తగా పునరుద్ధరిం చబ డిన కాకినాడ షోరూం కేవలం విక్రయాలకు మాత్రమే వేదిక కాదు, కళాత్మకత, కళానైపుణ్యం, ఉత్తమమైన జ్యువలరీ యొక్క ఉద్వేగభరితమైన ప్రాధాన్య తలను కస్టమర్లు అనుభవించే గమ్యస్థానంగా నిలుస్తుంది. జోయాలుక్కాస్ గ్రూపు విభిన్నమైన వ్యాపార ప్రయోజనాలు బహుళ బిలియన్ డాలర్ల అంతర్జాతీయ మిశ్రమం. భారతదేశం సహా అంతర్జాతీయంగా 11 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ గ్రూపు వ్యాపారాల్లో జ్యువలరీ, మనీ ఎక్స్ ఛేంజ్, ఫ్యాషన్ & సిల్క్ భాగంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 9,000 మంది నిపుణులతో, జోయాలుక్కాస్ అంతర్జాతీయంగా ఎన్నో పురస్కారాలు పొందిన మరియు గుర్తించబడిన జ్యువలరీ రిటైల్ చెయిన్స్‌లో ఒకటి. తెలియజేశారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర-దేవరపల్లి: స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా దేవరపల్లి మండలంలోని దేవరపల్లి పంచాయితీను జిల్లా పంచాయతీ అధికారి శాంత మణి , డివిజనల్ పంచాయతీ అధికారి అమ్మాజీ పరి శీలించి సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. గ్రామంలో వివిధ ప్రదేశంలో పర్యటించి తడి చెత్త పొడి చెత్త గూర్చి వివరించారు. ఇంటి నందు ఉపయోగించినటువంటి చెత్తను డంపింగ్ యార్డ్‌కి తరలించి వాటి ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేయు విధానంపై వివరించారు. ప్రజలందరూ ఇంటి చుట్టు ప్రక్కల, పరిసర ప్రాంతాలలో చెత్తను పార వేయ కుండా డస్ట్‌బిన్‌లో ఉంచినట్లయితే వాటిని పంచాయతీ వారు సేకరిస్తారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాజారావు, పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిశోర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ సద్వినియోగం చేసుకోండి : జేసీ

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం పురపాలక సంఘం పరిధి 6వ వార్డు బొక్కా వారి పేటలో ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ స్వయంగా పాల్గొని 10 మంది లబ్ధిదారులకు పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులను మీ ఆరోగ్యం ఎలా ఉంటుంది ప్రతి నెల ఒకటవ తేదీ ఉదయం సిబ్బంది మీ ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ సొమ్మును అందిస్తున్నారా, పెన్షన్ సొమ్మును మీరు ఉపయోగించుకుంటున్నారా, వ్యక్తిగతంగా లేక కుటుంబాలకు ఖర్చు చేస్తున్నారా అని ఆరా తీశారు. మీ వార్డుల్లో పారిశుధ్యం బాగుంటుందా ప్రతిరోజు రాత్రి సమయాల్లో వీధి దీపాలన్నీ వెలుగుతున్నాయా, కుళాయిల ద్వారా వచ్చే మంచి నీరు బాగుంటుందా అని అడిగితెలుసుకున్నారు. కొంతమంది లబ్ధిదారులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ సొమ్ము మాకు ఎంతగానో భరోసా కల్పిస్తుందన్నారు. మాకు ఉన్న బీపీ, షుగరు వంటి ఆరోగ్య సమస్యలను బట్టి కొంత సొమ్మును మందులకు వాడుకోగా మిగిలిన సొమ్ము ఖర్చులకు ఉపయోగించుకుంటున్నామని అన్నారు. బిపి, షుగర్ వంటి వ్యాధులు ఉన్నవారికి ప్రభుత్వం ఉచితంగా మందులు ఏఎన్ఎంలు ద్వారా అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి డబ్బులు ఖర్చు పెట్టుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సి. హెచ్ వెంకటేశ్వరరావు, వార్డు సెక్రటరీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమే బాధ్యత తీసుకుంటాం : సీపీఐ

విశాలాంధ్ర - పిఠాపురం : గతంలో రాజకీయ, అధికారుల నిర్లక్ష్యం వలన నిరుపేదల పక్షాన సీపీఐ బాధ్యత తీసుకుని బాధితులతో దరఖాస్తులు చేయిస్తున్నా మని ఈ బాధితులకు గత ప్రభుత్వంలో కొమనగిరిలో కేటాయిం చిన రెండు ఎకరాల భూమిని తక్షణమే ఇవ్వాలని శనివారం దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ పాత్రికేయులకు తెలిపారు. కొమ్మగిరి పంచాయితీ పరిధిలో చాలామంది బాధితులున్నారని వారిని గుర్తించి దరఖాస్తులు చేయించడం జరుగుతుందన్నారు. ఈ దరఖాస్తులు పరిశీలన చేసి తక్షణమే బాధితులకి న్యాయం చేయాలని లేని పక్షంలో ప్రభుత్వ ప్రకటించిన మూడు సెంట్లు భూమి సీపీఐ పార్టీ బాధితలకు అప్పగించడం జరుగు తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిత్తుగా వీరమని, కేశపోయిన గోవిందు, వనం లక్ష్మి, కొమురబోయిన వయమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఫెర్టిజ్ఞాన్ సదస్సు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్, రాజమండ్రి ఆబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి సహకారంతో, ఎంతగానో ఎదురుచూస్తున్న ఫెర్టిజ్ఞాన్ సదస్సుని విజయవంతంగా నిర్వహించింది. డాక్టర్. జ్యోతి సి. బుడి, (మెడికల్ డైరెక్టర్, ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్), ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి నిపుణులు వచ్చి పాల్గొనడం, వారు చూపించిన ఉత్సాహం, సంతాన సాఫల్యం ఎదుర్కొంటున్న సవాళ్లు, ఈ రంగంలో జరుగుతున్న ఆవిష్కరణలని చర్చించాల్సిన ఆవశ్యకతని ప్రతిఫలిస్తున్నాయన్నారు. రాజమండ్రిలో ఈ ఫెర్టిజ్ఞాన్, నేర్చుకోడానికి ఒక వేదిక కల్పించడమేకాకుండా, రోగుల ఫలితాలు, అనుభవాలని మెరుగుపరిచేందుకు అర్థవంతమైన భాగస్వామ్యాలు ఏర్పడ్డాన్ని కూడా ప్రోత్సహించిందన్నారు. భారతదేశంలో సంతాన సాఫల్య భవిష్యత్తుని తీర్చిదిద్దడంలో మా కృషికూడా వున్నందుకు గర్విస్తున్నాం" అని అన్నారు. దంపతులపై సంతానసాఫల్యం చూపించే భావావేశపరమైన వత్తిడి, ప్రభావం, అలాగే రోగుల సంరక్షణే ప్రధానంగా, సమగ్రచికిత్స అందించాల్సిన ప్రాముఖ్యత గురించి, ఇందులో పాల్గొన్న వారు విలువైన లోతైన విషయాలు తెలుసుకోగలిగారన్నారు. ఇంటరాక్టివ్ విభాగంలో, ఆసక్తికరమైన చర్చల్లో అందరూ పాల్గొన్నారన్నారు. ప్రముఖ సంతానసాఫల్య నిపుణులు, గైనకాలజిస్టులు ఆరోగ్యసంరక్షణ నిపుణులు ఈ సదస్సుకు హాజరై, సంతానసాఫల్య చికిత్సలో అధునాతన పరిణామాలు, ఉత్తమ అభ్యాసాలని చర్చించారన్నారు. మొత్తం 137 మంది ఆరోగ్య నిపుణులు పాల్గొని ఈ సదస్సుని విజయవంతం చేశారన్నారు.